క్లుప్తంగా

గాయత్రికి పౌరసన్మానం



నాగాయలంక: ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38 కెనోయ్ స్లాలమ్ నేషనల్స్‌లో బంగారు పతకం సాధించిన నాగాయలంక వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారిణి నాగిడి గాయత్రికి బుధవారం పౌరసన్మానం నిర్వహించారు. స్థానిక మండవ వెంకట్రామయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన కృష్ణాతీరంలోని ఏపీ పర్యాటక శాఖ ఫుడ్‌కోర్టు భవనంలో జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మండవ బాలవర్ధిరావు ప్రకటించిన రూ. 10వేల నగదును ఎమ్మెల్యే చేతులమీదుగా గాయత్రికి అందజేశారు. ఇదే నేషనల్స్‌లో ప్రాతినిధ్యం వహించిన గాయత్రి సోదరుడు నాగిడి రాజేష్‌ను కూడా సత్కరించారు. తలశిల రఘుశేఖర్, గ్రామ సర్పంచ్ కైతేపల్లి అంకాలు, శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అఖండ జ్యోతి రూపంలో అమ్మవారు



పెడన: పట్టణంలోని బ్రహ్మపురంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగ ఛాడేశ్వరి దేవి భజన గుడి వద్ద నిర్వహిస్తున్న జ్యోతిర్మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత భక్తులకు అఖండ జ్యోతి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అఖండ జ్యోతిని దర్శించుకున్నారు. పురవీధుల్లో అఖండ జ్యోతిని ఊరేగిస్తూ తిరిగి బ్రహ్మపురంలోని భజనగుడికి చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. పెడన సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ జి. సత్యనారాయణ పటిష్ట చర్యలు చేపట్టారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



బంటుమిల్లి: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని నోటిఫికేషన్ వచ్చి దాదాపు 15 రోజులు అవుతున్న పంచాయతీ అధికారులు రాజకీయ పార్టీల కటౌట్లు, బ్యానర్లు తొలగించడంలో ఉదాసీన వైఖరి అవలంభించారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు నిత్యం రాకపోకలు చేసే 216 జాతీయ రహదారి మార్జిన్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శొంఠి నాగరాజుకు ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానరును తొలగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే బంటుమిల్లి ప్రధాన కాలువ నుంచి బంటుమిల్లి వచ్చే జాతీయ రహదారిలో టీడీపీ బ్యానరు, స్తంభాలకు కటౌట్ల్ ఎక్కడివక్కడే ఉండటం శోచనీయం.

చికెన్ దుకాణాల పరిశీలన

నాగాయలంక: రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు ప్రబలడంతో మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన నాగాయలంక గ్రామంలో స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సాయి మౌనిక అప్రమత్తంగా ఉండాలని చికెన్ వ్యాపారులను హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆమె చికెన్ దుకాణాలను పరిశీలించారు. బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ అమ్మకాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

పట్టునూ వదలని నకిలీలు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వినతి



పట్టుగూళ్లు కట్టకుండా ఖాళీగా ఉన్న మెస్

పాపవినాశనం(ఘంటసాల): ఇటీవల వచ్చిన కృష్ణా వరదలకు తీవ్రంగా నష్టపోయినా అలవాటు పడిన పంట కదా అని పట్టు పురుగులు వేసి మరింత నష్టపోయామంటూ మండలంలోని పాపవినాశనం గ్రామానికి చెందిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులు అందించిన వివరాల మేరకు.. ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు లంక భూముల్లో పట్టు గూళ్లను పండిస్తున్నారు.

అధికారులు పంపిణీ చేసిన పురుగులే..

అయితే జనవరి 8వ తేదీన సెరీకల్చర్ అధికారులు ఆయా రైతులకు పట్టు పురుగులు పంపిణీ చేయగా వారు వాటికి మేత, మందులు వేసి పెంచుతున్నారు. అధికారులు పంపిణీ చేసిన పురుగులే నకిలీవి కావడంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

ఇప్పటికి రూ. 50 వేలకు పైగా ఖర్చు..

ఒక్కో రైతు సుమారు రూ. 50 వేల వరకు ఖర్చు చేశామని, కానీ ఇప్పటి వరకు పంట చేతికి రాలేదన్నారు. దీనికి కారణం అధికారులు నకిలీ పట్టు పరుగులు సరఫరా చేయడం వల్లే నష్టపోయామని ఆరోపిస్తున్నారు. తీవ్రంగా నష్టపోయిన మమ్మల్ని అధికారులు, ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాస్తవంగా ఇలా.. కానీ..

వాతావరణం బాగుంటే 8 రోజుల వయస్సున్న పురుగులను ఇస్తారు. రైతులకు ఇచ్చిన 22వ రోజుకు గూళ్లు కట్టడం మొదలవ్వాలి. 28వ రోజుకు గూడుకట్టడం పూర్తవుతుంది. 9 నుంచి 14 మేతలకు రావాల్సిన పట్టు పురుగులు 24 మేతలకు పైగా వేసిన గూళ్లు కట్టుకోలేదన్నారు. ఇప్పటి వరకు అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన కనీసం పంట చూడటానికి కూడా రాలేదని వాపోయారు. దీంతో పంట కాలం దాటినా పట్టుగూళ్లు కట్టుకోకపోవడంతో దుర్వాసన రావడంతో కూలీలకు అధిక రేటు చెల్లించి పంటను తీసివేసినట్లు చెప్పారు.

గూడు కట్టకపోవడానికి అనేక కారణాలు..

పట్టు పురుగులు సమయానుకూలంగా గూడు కట్టకపోతే దానిపై అనేక కారణాల ప్రభావం ఉంటుంది. వాతావరణ పరిస్థితులు, నాణ్యమైన ఆహారం, పశువుల ఎరువు, పరిసరాల ప్రభావం, యాజమాన్య పద్ధతులు సక్రమంగా ఉంటే సరైన సమయానికి పురుగులు గూళ్లు కడతాయి. పంట పొలాల్లో పురుగు మందుల ప్రభావం, వాటి వాసనలు కూడా కారణం కావొచ్చు. పట్టు పురుగులు నకిలీ ఇచ్చారనడంలో ఎలాంటి నిజం లేదు. కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఒకే రకమైన పట్టు గుడ్లు ఇచ్చాం. ఏలూరులో వేసిన గుడ్లు ఆరోగ్యకరంగా సమయానుకూలంగా దశలు మారుతున్నాయి. పాపవినాశనంలో వేసిన గుడ్లు అందుకు విరుద్ధంగా ఉండటానికి పై కారణాలు కావొచ్చు.

–డి.వాణి, జిల్లా సెరీకల్చర్ ఆఫీసర్

అధికారులు పట్టించుకోవడం లేదు..



పట్టు పురుగులు వేసి పంట కాలం దాటిన గూళ్లు కట్టుకోవడం లేదని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు. ఫోన్‌లో సమాచారం ఇస్తే అదిగో వస్తున్నాం, ఇదిగో వస్తున్నాం అంటున్నారే కాని సకాలంలో స్పందించడం లేదు. పట్టు పురుగుల మేతకు అధిక ఖర్చు అవుతుంది. దీంతో పంటను తీసివేశాం.

– కైతేపల్లి మల్లేశ్వరరావు, రైతు, పాపవినాశనం

రూ.50 వేలు ఖర్చు చేశా..



జనవరి 8న పట్టు పురుగులు వేశాను. 9 నుంచి 14 మేతలకు రావాల్సిన పంట 24 మేతలు వేసినా రాలేదు. సుమారు 21 రోజుల నుంచి 24వ రోజుకు పురుగులు గూళ్లు కట్టాలి. కానీ ఒక్కగూడు కూడా కట్టుకోలేదు. ఎక్కువ కూలి ఇచ్చి పురుగులను తీసివేశాం. దీంతో రూ.50 వేలు ఖర్చయింది. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

– కనగాల బుజ్జి, మహిళా రైతు, పాపవినాశనం

భక్త జనసంద్రం



తీరంలో భక్తుల కోలాహలం



సూర్యనమస్కారం చేస్తున్న భక్తుడు

మాఘపౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం హంసలదీవి సాగరతీరం,కృత్తివెన్ను మండలంలోని తీరాలు, మంగినపూడి బీచ్ భక్తజన సంద్రంగా మారింది. సింధుస్నానాలు ఆచరించేందుకు సాగరతీరాలకు భక్తులు పెద్దఎత్తున పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి చేరుకొని సూర్యోదయ వేళ సింధుస్నానం చేశారు. సైకత లింగాలకు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. భక్తులకు పలు సేవా సంస్థలు ముందుకొచ్చి దాతృత్వాన్ని చాటాయి.

–కోడూరు/కోనేరుసెంటర్/ కృత్తివెన్ను



ఒత్తులను వెలిగిస్తున్న భక్తులు



విన్యాసాలతో సందడి చేస్తున్న యువకులు



భక్తులకు సూచనలిస్తున్న పోలీసులు



హంసలదీవి రోడ్డులో నిలిచిన వాహనాలు



అల్పాహారం అందజేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

కంటి సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



కంటి వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నంటౌన్: కంటి చూపు సంరక్షణ విషయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక లలితా కన్వెన్షన్ హాల్లో కొల్లు ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గం ఇంఛార్జి బండి రామకృష్ణతో కలిసి బుధవారం ప్రారంభించారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించే లక్ష్యంతో ముందుకొచ్చిన శంకర ఐ హాస్పిటల్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. సేవా కార్యక్రమాల నిర్వహణ మనసుకు అత్యంత ప్రశాంతతను కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో కొల్లు ఫౌండేషన్ ప్రతినిధి కొల్లు పునీత్ చంద్ర, ఫీనిక్స్ ఫౌండేషన్ ప్రతినిధి చుక్కపల్లి అవినాశ్, శంకర కంటి ఆస్పత్రి ప్రతినిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ పరిశీలన



అనధికార లే అవుట్ వద్ద టీపీవో సుజనాకుమారి, బీవోఐ జీతేంద్ర, ప్లానింగ్ కార్యదర్శులు

పెడన: పట్టణంలోని 14వ వార్డులో ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయించేందుకు కొందరు యత్నిస్తున్నారని, అటువంటి ప్లాట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి బి. సుజనాకుమారి పేర్కొన్నారు. బుధవారం ఆ వార్డులోని అనధికార లే అవుట్‌ను పరిశీలించడమే కాకుండా మున్సిపల్ సిబ్బందితో పాటిపెట్టిన సర్వే రాళ్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురపాలక సంఘం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోతారని స్పష్టం చేశారు. ఇలా కొనుగోలు చేసిన వారు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర, ఆయా సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమనీయం వేణుగోపాలుడి కల్యాణం

- శృంగేరీ పీఠం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పణ
- అశేషంగా పాల్గొన్న భక్తజనం



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

కోడూరు: ప్రత్యేకంగా అలంకరించిన అతిపురాతనమైన కల్యాణ వేదికపై హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం అత్యంత వైభవంగా సాగింది. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేణుగోపాలుడి ఆలయాన్ని శృంగేరీ పీఠం దత్తత తీసుకోవడంతో ఈ ఏడాది కల్యాణ మూర్తులకు పీఠం తరుపున ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. గుంటూరు జిల్లా అనంతవరంకు చెందిన కుప్పా రామగోపాలస్వామియాజీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు స్వామివారు, అమ్మవార్ల గుణగణాలను వివరిస్తూ అనుగ్రహభాషణ చేశారు. ముందుగా జగజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేణుగోపాలుడి కల్యాణం తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అర్ధరాత్రి 12గంటల నుంచి బుధవారం వేకువజామున 2.30 గంటల వరకు కల్యాణం జరిగింది. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. కాగా సింధుస్నానాల నేపథ్యంలో వేణుగోపాలుడిని దర్శించుకొనేందుకు బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి భక్తిభావం చాటుకున్నారు.

విశ్వేశ్వరుడి కల్యాణం



కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

హంసలదీవిలో వేంచేసియున్న అన్నపూర్ణ, బాలాత్రిపురసుందరీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరిగింది. వేదపాఠశాల విద్యార్థులు వేదపఠనం చేశారు. కల్యాణం అనంతరం స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. గర్భాలయంలోని మూలమూర్తికి నాగభరణాన్ని అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భక్తులు

ఘంటసాల: ఘంటసాల శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామివారి దేవస్థానంలో అగస్త్య మహర్షి, లోపాముద్ర దేవి దంపతుల విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీజలధీశ్వర దేవస్థానంలో మాఘ పూర్ణిమ ఘడియల్లోనే శివ పార్వతులను ఏకపీఠంపై ప్రతిష్ఠించిన అగస్త్య మహర్షి, లోపాముద్ర దేవి దంపతుల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు రమా గమిని వయోలిన్ వాయిద్యం ద్వారా పలకించిన శివ కీర్తనలు భక్తులను అలరించాయి. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేసిన వడ్నాల వేణుమాధవ్, శ్రీవిద్య, వయోలిన్ విద్వాంసురాలు రమా గమినిలను నిర్వాహకులు సత్కరించారు.

పురుగు మందు షాపుల తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందాలు

మోపిదేవి: వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు పురుగు మందుల విక్రయ షాపులను వ్యవసాయశాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కేవి సుదర్శనరాజు మాట్లాడుతూ షాపుల్లో క్రయ, విక్రయాలకు సంబంధించి రికార్డులు, లైసెన్సులు, బిల్లులు, పురుగుమందుల గోడౌన్ తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. పురుగు మందుల ధరలు ఎప్పటికప్పుడు బోర్డు మీద రాసి ఉండాలని సూచించారు. ఏఓ డీ అరుణ్‌కుమార్, అవనిగడ్డ ఏడీఏ జయప్రద, ఏఓ హెప్సిబా రాణి పాల్గొన్నారు.

అవనిగడ్డ: మండలంలోని పలు ప్రాంతాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ మద్దులేటి, వ్యవసాయ అధికారి వీఎస్ సురేష్ అవనిగడ్డలోని పలు షాపులను తనిఖీచేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ జయప్రద, ఏఓ శౌరమ్మ, వీఏఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• స్వచ్ఛ చల్లపల్లికి విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లి సుందరీకరణకు మన కోసం మనం ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు తన వంతుగా విశ్రాంత ఉపాధ్యాయులు రావూరి సూర్యప్రకాశరావు రూ. 25వేలు విరాళాన్ని అందజేశారు. బుధవారం ఆయన స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారధి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌ను కలిసి చెక్కు రూపంలో ఈ మొత్తాన్ని అందజేశారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల తరపున డీఆర్‌కే ప్రసాద్ సూర్యప్రకాశరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

• రైతులంతా విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

గూడూరు: రైతులకు ప్రభుత్వం ద్వారా కల్పించే ప్రయోజనాలు పొందడానికి తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ఆంజనేయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పోసినవారిపాలెంలో జరుగుతున్న విశిష్ట నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ విశిష్ట నమోదు సంఖ్య పొందిన రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, పంట బీమా వంటి లబ్ధిచేకూరుతుందని తెలిపారు.

కృత్తివెన్ను: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల ఏఓ ఎస్. జెన్నీ వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బందికి రైతులకు విశిష్ట గుర్తింపు నంబరుపై అవగాహన కల్పించారు. రైతు తప్పనిసరిగా ఈ గుర్తింపు నంబర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

చల్లపల్లి: ప్రతి రైతు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకుని గుర్తింపు కార్డు పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి సాయి సింధు తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలని వివరించారు.

• నిత్యావసర సరుకుల పంపిణీ

ఘంటసాల: నిరుపేదలకు రెడ్డిగారి మదర్ హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ, బేతని చర్చి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేసినట్లు సంస్థల ఇన్‌చార్జి పోతన వెంకట కృష్ణారావు తెలిపారు. ఘంటసాల గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు 10 వస్తువులు కలిగిన రేషన్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. వెంకట రామకృష్ణ మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

• నేడు గంగాభవానీ జాతర

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో గంగాభవానీ అమ్మవారి జాతరను గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి మహిళలు సలిమిడి, వడపప్పును సమర్పిస్తారని, అనంతరం గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు. రాత్రికి నైవేద్యాల సమర్పణ, అమ్మవారి గుడి జాతరను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

• కనులపండువగా కల్యాణం

చల్లపల్లి: చల్లపల్లిలోని శ్రీచక్రస్థిత శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహదూర్ మనుమడు హరిశ్చంద్రప్రసాద్ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఘంటసాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

• వృద్ధురాలు మృతి

కోనేరుసెంటర్: ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ వృద్ధురాలు స్పృహ కోల్పోయి మృతిచెందిన ఘటన బుధవారం మచిలీపట్నంలో చోటుచేసుకుంది. వివరాలు.. మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన టి.కాళికా (65) కొన్ని రోజులుగా ఈఎన్‌టీ సమస్యతో బాధపడుతోంది. బుధవారం చైతన్య ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రిలో చూపించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో నీరసం వచ్చిన ఆమె రోడ్డు పక్కన ఉన్న బల్లపై కూర్చొని కుప్పకూలిపోయింది. స్థానికులు మచిలీపట్నం పోలీసులకు తెలియజేశారు. పోలీసుల నుంచి సమాచారం తెలుసుకున్న మృతురాలి బంధువులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తీసుకువెళ్లిపోయారు.

• గంగమ్మతల్లిపై సూర్యకిరణాలు

నాగాయలంక: గ్రామంలో కొలువైన మండవ వంశీయుల గంగమ్మతల్లి ఆలయంలో బుధవారం అమ్మవారిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఒకసారి సూర్య కిరణాలు నేరుగా అమ్మవారి శిరస్సు నుంచి విగ్రహంపైన పడగా మళ్లీ మాఘ పౌర్ణమి పర్వతిథి రోజున సూర్యకిరణాలు గంగమ్మతల్లిపై ప్రసరించాయి. సూర్య కిరణాల అభిషేక సమయంలో అమ్మవారిని భక్తులు ఆనందంతో దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

• వృద్ధురాలి నేత్రాలు దానం

నాగాయలంక: గ్రామంలోని ఎనిమిదో వార్డుకు చెందిన తలశిల పంచాక్షరమ్మ(96) అనారోగ్యంతో బుధవారం మరణించగా ఆమె నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకొచ్చారు. ఐ టెక్నీషియన్ మహేష్ బృందం మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

• వాసవీక్లబ్ పట్టణ అధ్యక్షురాలిగా విజయదుర్గ

పెడన: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ కృష్ణాజిల్లా గవర్నర్ అన్నం సునీత వాసవీ క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన పట్టణ అధ్యక్షురాలిగా కొమ్మూరి విజయదుర్గను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజయదుర్గను శ్రీవాసవి క్షేత్రంలో వాసవి మహిళా మండలి కార్యవర్గ సభ్యులు సత్కరించారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని విజయదుర్గ తెలిపారు.

• వైభవంగా తిరుపతమ్మ కల్యాణం

కోడూరు: మండలంలోని దింటిమెరక సమీపంలోని 17వ నెంబర్ పంటకాలువ పక్కన ఉన్న లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద స్వామివార్ల కల్యాణాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గోపయ్య– తిరుపతమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కవానిదారి గ్రామానికి చెందిన దాసరి నరేష్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కల్యాణాన్ని జరిపించారు. మహిళలు పాలపొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

• నూతన కౌలు చట్టం తీసుకురావాలి

చల్లపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతుల సంక్షేమం, రక్షణ కోసం తక్షణమే సమగ్రమైన కొత్త కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. చల్లపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తవుతున్నా.. ఇంతవరకూ కౌలు చట్టాన్ని తీసుకురావడంలో విఫలం అయ్యిందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కింద రూ. 20వేలు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామారావు, నియోజకవర్గ కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు గోగినేని రత్తయ్య, లంక నాగమల్లేశ్వరరావు, ఏఐవైఎఫ్ నేత సిద్దాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

• శ్రీరామలింగేశ్వరునికి అభిషేకాలు

నాగాయలంక: మాఘ పౌర్ణమి పర్వదినం సందర్భంగా నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద సాగర సంగమ(సీ బ్యాక్ వాటర్) సమన్విత కృష్ణానదిలో బుధవారం క్షేత్రం కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నది ఒడ్డున కొలువైన శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శివయ్యకు భక్తులు స్వీయ అభిషేకాలు, పూజలు చేశారు.